క్లుప్తంగా

ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యం

చలపతి ఫార్మశీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాలలో విద్యాబోధన చేస్తున్నామని చలపతి ఫార్మశీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ప్రముఖ హెల్త్ కేర్ కంపెనీ, బీఎన్‌బీకేర్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ ప్రాంగణం ఎంపికకు ఫార్మా డీ, ఎం ఫార్మసీ ఫార్మకాలజీ విభాగపు విద్యార్థులే అర్హులనీ తెలిపారు. ఈ ఎంపికల్లో కళాశాల నుంచే కాకుండా ఇతర కళాశాల నుంచి మొత్తం 56 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఎంపికల్లో మొత్తం 10 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారికి రానున్న రెండు నెలలు కళాశాల ప్రాంగణంలో శిక్షణ ఇస్తారని ఈ శిక్షణ కాలంలో రూ.10 నుంచి రూ.15 వేల వేతనాన్ని ఇవ్వనున్నారని, శిక్షణాకాలం తరువాత ఉద్యోగ నిర్వహణ ఇంటి వద్ద నుంచి చేస్తారన్నారు. నెలకు రూ 25000 చొప్పున జీతం ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికై న విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు.

ఎసెండ్ ఈ స్పోర్ట్స్ కంపెనీతో వీవీఐటీయూ ఒప్పందం



పెదకాకాని: విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ స్పోర్ట్స్ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు దుబాయ్‌కి చెందిన ప్రముఖ ఈస్పోర్ట్స్ సంస్థ ఎసెండ్ ఈస్పోర్ట్స్ తో వీవీఐటీయూ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం చేసుకుందని సెక్రటరీ సూర్యదేవర బదరీప్రసాద్ అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఎసెండ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఐఎస్ఎన్ ప్రదీప్, వీవీఐటీయూ సెక్రటరీ సూర్యదేవర బదరీప్రసాద్ ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ సూర్యదేవర బదరీప్రసాద్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం ద్వారా విద్యార్థులలో ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాన్ని పెంపొందించి గేమ్ డిజైన్ డవలప్‌మెంట్ తో పాటు కోచింగ్, కంటెంట్ రైటింగ్, ఈగేమ్స్ ఆడే సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు పాటించవలసిన నియమాలను విద్యార్థులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈగేమ్స్ రంగంలో గల ఉద్యోగావకాశాలకు తగ్గట్టు విద్యార్థులను సన్నద్ధం చేస్తామన్నారు. అధునాతన సాంకేతిక సాధనాలైన ఆగ్‌మెంటెడ్ రియాలటీ, వర్చువల్ రియాలిటీ, యూనిటి టూల్ అన్ రియల్ ఇంజన్ వంటి అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో మామిళ్లపల్లి శ్రీకృష్ణ, సంధానకర్త డాక్టర్ పి.కృష్ణప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళదాం

- అమలు కాని హామీలతో ప్రజల్ని మోసం చేయడమే బాబు నైజం
- సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చడంలోనే విఫలం
- పెదకాకానిలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీపై ప్రచారం



అగతవరప్పాడులో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అంబటి మురళీకృష్ణ, స్థానిక మహిళలు

పెదకాకాని: అమలు కాని హామీలిచ్చి ప్రజల్ని మోసం చేయడం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని అగతవరప్పాడు గ్రామంలో మంగళవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేని ఫెస్టో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అంబటి మురళీకృష్ణ స్థానిక మహిళలతో పాటు నేలపై కూర్చుని కూటమి మోసాలను ప్రజలకు తెలియజేశారు.

అన్నీ మోసపూరిత హామీలే

ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి మోసపూరిత మాటలు చెప్పి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒక్కొక్క ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా లక్షల్లో నగదు వస్తుందని నమ్మించారన్నారు. మాయ మాటలు నమ్మిన ప్రజలు, ముఖ్యంగా కొందరు మహిళలు మోసపోయి ఓటు వేశారన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన బాబు ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు లేకపోతే నెలకు 3 వేలు నిరుద్యోగ భృతి, స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి 15 వేల రూపాయలు, ప్రతి రైతుకు ఏటా 20 వేలు, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్‌లు, ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు అన్ని చెప్పిన ప్రభుత్వం పథకాల అమలులో ఘోరంగా విఫలమైందన్నారు.

ప్రశ్నించకుండా చేస్తున్నారు

బాబు మోసాలను, అన్యాయాలను, అక్రమాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పథకాలు ఇవ్వకపోవడంతో ఒక్కొక్క కుటుంబం ఎంత నష్టపోయిందో వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని గుర్తు చేశారు. తల్లికి వందనం పథకం ద్వారా 8 వేల రూపాయలే ఇచ్చారని ఒక మహిళ అడిగితే మిగతా నగదు కేంద్రం ఇస్తుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అనంతరం బాబు మోసపూరిత ఎన్నికల మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, జోసఫ్, గ్రామ సర్పంచ్ పిట్టు కృష్ణారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆట్ల సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ కొండమడుగు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరెడ్డి, నాగరాజు, బందెల ఉదయ్, బాబు ప్రకాష్, కాలింత రమేష్, బండ్లమూడి భాను కిరణ్, గద్దె కిషోర్, రుద్రారెడ్డి నీలం సతీష్, కోటేశ్వరీ, గాబ్రేలు, ఎస్‌కె ఇబ్రహీం, కుంచల అంజిరెడ్డి పాల్గొన్నారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు



పోస్టర్ ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుంటూరు రూరల్: మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని ఆయనను నమ్మితే నట్టేట ముని గినట్టేనని వైఎస్సార్‌సీపీ రూరల్ మండలం కన్వీనర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి (ఏఎస్ఆర్), ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డిలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ఇంచార్జ్ బలసాని కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని చల్లావారిపాలెం, గోర్లవారిపాలెం గ్రామాల్లో మంగళవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రతి మహిళలకు నెలకు రూ 1500 ఇస్తానని మోసం చేశాడన్నారు. అదేవిధంగా నిరుద్యోగభృతి ప్రతి నిరుద్యోగికి రూ 3000 ఇస్తానని మోసం చేశాడన్నారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వివరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు దరిశి సుజాత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, పిల్లి మేరీ, ఉగ్గం సాంబశివరావు, కొండా కోటిరెడ్డి, గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నరేంద్ర అండదండలతో బరితెగింపు

- భార్యను బెదిరిస్తున్న పౌల్‌రాజ్‌ను అరెస్ట్ చేయాలి
- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ డిమాండ్

పట్నంబజారు: పొన్నూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అనుచరుడు భార్యను వదిలించుకోవాలని చూస్తున్నాడని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆరోపించారు. పార్టీ గుంటూ రు జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వెంకటేశ్వరమ్మను, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పౌల్‌రాజు 7 ఏళ్ల క్రితం ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాడని తెలి పారు. భార్యకు తండ్రి ద్వారా సంక్రమించిన ఆస్తిని కాజేసి ఇప్పుడు భార్యను వదిలించుకోవాలని చూస్తున్నాడని దుయ్యబట్టారు. బాధితురాలు పొన్నూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే... చంపుతానని భర్త పౌల్‌రాజ్ బెదిరిస్తున్నాడని తెలిపారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు ప్రధాన అనుచరుడుగా ఉండే పౌల్‌రాజు నుంచి తప్పించుకొని అతని భార్య ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల చేసిన అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు అన్ని కూడా కట్ట కట్టి ఉన్నాయని, అవన్నీ బయటకు తీస్తామని హెచ్చరించారు. వెంకటేశ్వరమ్మ ఘటనలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల పాత్ర లేకుంటే వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ప్రమేయం లేకుంటే బాధితురాలకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీని కలిసి విన్నవించాలన్నారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల అవినీతి అక్రమాల డైరీని ప్రజలకు వివరిస్తామన్నారు. ధూళిపాళ్ల నరేంద్ర అవినీతి అక్రమాలపై చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా ఎంపీ అయోధ్య జన్మదిన వేడుకలు



కేకు కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు అంబటి మురళీకృష్ణ, మోదుగుల

పట్నంబజారు: రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పార్లమెంట్ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఎంపీ అయోధ్యరామిరెడ్డి జన్మదిన వేడుకల కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా మోదుగుల మాట్లాడుతూ కష్టకాలంలో ఒక వ్యాపార వేత్తగా, ఉమ్మడి గుంటూరు జిల్లాలో మా అందరికి అయోధ్య, కొండంత అండ అని కొనియాడారు.

ఆయన జన్మదినంతో పాటు పార్టీ బాధ్యతలను ఆయన భుజాన వేసుకుని ముందుకు సాగే పరిస్థితి భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ ఎంపీ అయోధ్యరామిరెడ్డి రాజకీయంగా ఎటువంటి సమస్య ఉన్నా.. మమ్మల్ని పోత్సహించి మమ్మల్ని ముందుకు నడిపించే వ్యక్తి ఆయన అని అన్నారు. పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు, కాకాని ముద్దుబిడ్డ అయిన అయోధ్య కాకాని ప్రజలకు ఎంతో మంచి సేవ చేసి రాజకీయాల్లో వచ్చారు. స్వచ్ఛందంగా ప్రజలకు మంచి చేస్తున్న గొప్ప వ్యక్తి ఆయన అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గులాంరసూల్, తాడిబోయిన వేణు, పఠాన్ సైదాఖాన్, అవినాష్, సురసాని వెంకటరెడ్డి, బైరెడ్డి రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

మరో యువకుడి ప్రాణం తీసిన ప్రమాదం

- 8 రోజుల వ్యవధిలో ముగ్గురు (స్నేహితులు) యువకులు మృతి
- శోకసముద్రంలో మూడు కుటుంబాలు



రమణ (ఫైల్)



షేక్ సాధిక్ (ఫైల్)



శివశంకర్ (ఫైల్)

పెదకాకాని: రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి యువకుడొకరు మరణించిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గుంటూరు ఇస్రాయెల్‌పేటకు చెందిన రమణ సిమెంట్ కొట్టులో పనిచేస్తున్నాడు. ఈనెల 6వ తేదీన రమణ తన స్నేహితుడైన షేక్ సాధిక్ బైక్‌పై ఎక్కి గుంటూరు నుంచి నందివెలుగు మీదుగా తెనాలి బయలు దేరారు. వారు ప్రయాణిస్తున్న బైక్ మార్గమధ్యంలో తక్కెళ్ళపాడు శివారు పెట్రోల్ బంక్ వద్దకు చేరుకునే సరికి ఎదురుగా వెళుతున్న లారీ షడన్ బ్రేక్ వేయడంతో ఆ లారీని ఢీ కొంది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న షేక్ సాధిక్‌తో పాటు వెనుక కూర్చున్న రమణకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో రమణ (25) పరిస్థితి విషమించి సోమవారం రాత్రి 11:30 గంటలకు మరణించాడు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న షేక్ సాధిక్ (21) ఈనెల 8వ తేదీన మరణించిన సంగతి విదితమే. మృతుడి తండ్రి సాంబయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం రమణ మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

మూడు కుటుంబాల్లో విషాదం

ప్రాణ స్నేహితులు పట్టుమని మూడు పదుల వయస్సు కూడా నిండలేదు. వివాహాలు కూడా కాలేదు. సంసార బాధ్యతలు కూడా చేపట్టలేదు. చెట్టు అంత కొడుకు చేతికి అందివచ్చాడన్న కొండంత ఆశతో బిడ్డలను చూసి తల్లిదండ్రులు మురిసిపోతున్న తరుణంలో మూడు కుటుంబాల్లో పెను విషాదం. అల్లారు ముద్దుగా పెంచుకున్న బిడ్డలు విగతజీవులుగా కళ్ళ ముందు కనిపించడంతో ఆ కుటుంబసభ్యుల రోదనలు ఆపడం ఎవరి తరం కాలేదు. తమ బిడ్డలు లేరు అనే చేదు నిజాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. 8 రోజుల వ్యవధిలోనే ముగ్గురు ప్రాణస్నేహితులు మృత్యు ఒడికి చేరారు. తెనాలికి చెందిన కొండూరు శివశంకర్ గుంటూరు ఆర్టీసీ కాలనీలోని తాతయ్య ఇంటి వద్ద ఉంటూ నగరంలోని ఆసుపత్రిలో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తున్నాడు. 18 సంవత్సరాలు కూడా నిండని శివశంకర్ (18) ఈనెల 5న రైలు పట్టాలపైకి చేరి ప్రేమ ఫెయిల్ అంటూ ఇంటికి ఫోన్ చేస్తూ మరీ రైలు బండి కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం అనంతరం 6న అంత్యక్రియలు నిర్వహించేందుకు స్వగ్రామమైన తెనాలి బయలు దేరారు. మిత్రుడి పోస్టుమార్టం పూర్తయ్యే వరకూ అక్కడే గడిపిన ప్రాణస్నేహితులు షేక్ సాధిక్, రమణలు కడసారి చూసి కన్నీటి వీడ్కోలు పలికేందుకు మృతదేహం వెంట తెనాలి బయలు దేరారు. ఇంతలోనే లారీ రూపంలో వెంటాడిన మృత్యువు సాధిక్ (21), రమణ (25)లను కబళించింది. మూడు కుటుంబాల్లో విషాదం నింపింది.

ఘనంగా లైబ్రేరియన్ దినోత్సవం

పెదకాకాని: షియాలీ రామామృత రంగనాథన్ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన భారతీయ గ్రంథాలయ శాస్త్రవేత్త గ్రంథాలయ సమాచార శాస్త్ర పితామహుడు అని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొల్లిపర ఆనందరావు అన్నారు. పెదకాకాని గ్రంథాలయంలో మంగళవారం ఎస్ఆర్ రంగనాథన్ 133వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయాధికారి నంద్యాల నాగిరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ ఎస్ఎల్ఈ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కొల్లిపర ఆనందరావు మాట్లాడుతూ 1931లో గ్రంథాలయ శాస్త్రంలో ఐదు ప్రధాన సూత్రాలు (ఫైవ్ లాస్) అనుసరించి వాటిని విస్తృతంగా ప్రచారం చేశారన్నారు. ఉపయోగం కోసం పుస్తకాలు, ప్రతి చదువరికి తన పుస్తకం, ప్రతి పుస్తకానికి ఒక చదవరి, చదువరి సమయాన్ని వృథా చేయకుండా రక్షించు, గ్రంథాలయాలు ఒక పెరిగే సంస్థ, మొత్తం గ్రంథాలయ తత్వశాస్త్రం ఈ ఐదు సూత్రాలలోనే దాగి ఉందన్నారు. ముందుగా ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తదుపరి విద్యార్థులకు డిబేట్ పోటీలు నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్: నగరంలోని ఏటుకూరు శాఖ గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాధన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రంథాలయ ప్రాముఖ్యతను టి.గిరిధర్ వివరించారు. కార్యక్రమంలో కె.రత్తయ్య, ఎన్.రాంబాబు, ఎ.నాగేశ్వరరావు, టి.అప్పారావు గ్రామంలోని ప్రజలుపాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే పేదలకు మేలు

వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకానిలోని లీమ బదిరుల(చెవిటి, మూగ, మానసిక వికలాంగులు) ఆశ్రమంలో మంగళవారం రాజ్యసభ సభ్యుడు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఆశ్రమంలోని బదిరులతో కలసి కేక్ కత్తిరించి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. వారందరికీ కేక్ తినిపించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ముఖ్యంగా ప్రత్యేక అవసరాలు కలిగిన వారందరికీ పింఛన్‌లు మంజూరు చేయడంతో పాటు వైద్యసేవలు అందించారన్నారు. అనంతరం ఆశ్రమంలో ఉన్న వారందరికీ భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణి, జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, మండల పార్టీ అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి వుయ్యూరు సతీష్‌రెడ్డి, బిసిసెల్ అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్, గోళ్ళ జోసెఫ్, శ్యాంముఖర్జీ, బందెల ఉదయ్‌శంకర్, బండ్లమూడి బానుకిరణ్, గద్దల రాజేష్, సుంకర నర్సిరెడ్డి, షేక్ అబీబుల్లా, శిరిబోయిన అవినాష్, సురేంద్ర, కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆచరణాత్మక న్యాయవిద్యకు మూల స్తంభం మూట్ కోర్ట్

హైకోర్టు న్యాయవాది డాక్టర్ చింతా రామకోటిరెడ్డి



పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచరణాత్మక న్యాయవిద్యకు మూలస్తంభంగా పరిగణించబడే మూట్ కోర్ట్ న్యాయవిద్యలో విద్యాపరమైన వ్యాయామాన్ని సృష్టిస్తుందని హైకోర్టు న్యాయ వాది డాక్టర్ చింతా రామకోటిరెడ్డి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ ఆధ్వర్యంలో మంగళవారం ఎల్ఎల్‌బీ హానర్స్ విద్యార్థులకు మూట్ కోర్టుపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షురాలుగా వ్యవహరించిన హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.జయలక్ష్మి మాట్లాడుతూ తరగతి యొక్క అభ్యాసం, చట్టపరమైన అభ్యాసం యొక్క వాస్తవికతల మధ్య అంతరాన్ని ఈ మూట్ కోర్ట్ తగ్గిస్తుందన్నారు. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈనెల 14వ తేదీ ఉదయం అంతర్గత పోటీలు నిర్వహించి విజేతలను వైజాగ్‌లో జరిగే మూట్ కోర్ట్ కాంపిటీషన్లకు ఎంపిక చేసి పంపడం జరుగుతుందన్నారు. అనంతరం రామకోటిరెడ్డిని హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ఎస్.జయలక్ష్మి, అధ్యాపక బృందం డాక్టర్ పి వెంకటరమణ, డాక్టర్ ఎస్.ద్రశేఖర్, డాక్టర్ ఘంటా సతీష్ కుమార్, డాక్టర్ చెన్నం సురేష్, డాక్టర్ కె. శివరాం, డాక్టర్ జ్యోతి సంపూర్ణ, అభిలాష్ గోపీనాథన్, చెన్నారావు సన్మానించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చేబ్రోలు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 17 మంది అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్ మంగళవారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని సుద్దపల్లి, నారాకోడూరు, మంచాల, గుండవరం, గొడవర్రు, వేజండ్ల, శ్రీరంగపురం, పాతరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన 17 మందికి రూ.20,16,931ల నగదు చెక్కులను ఎమ్మెల్యే నరేంద్రకుమార్ అందజేశారు. పంపిణీ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆర్థిక సమాచారంపై అవగాహన కలిగి ఉండాలి

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆర్థిక సమాచారంపై అవగాహన కలిగి ఉండాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణకుమార్, బి.ప్రభులు తెలిపారు. మంగళవారం పెదనందిపాడు మండలం వరగాని గ్రామంలో బ్యాంక్ ఖాతాదారులకు ఆర్థిక సమాచారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వరగాని స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ పరిధిలోని అనపర్రు గ్రామ పంచాయతీ ప్రజలకు ఆర్థిక సమాచారం కల్పించేందుకు కేంద్ర స్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ కిషోర్‌కుమార్, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ రామమోహన్, ఎఫ్ఐ మేనేజర్ గిరిబాబు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.